
సాక్షి బాపట్ల

మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



రేపు విశ్వకర్మ యజ్ఞం

క్రోసూరు: గుంటూరు జిల్లా ఉద్దండరాయుని పాలెంలో బుధవారం విశ్వకర్మ యజ్ఞం జరుగుతుందని సంఘం ప్రతినిధి సిద్దు కామేశ్వరాచారి సోమవారం తెలిపారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 42,250 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 17,000 క్యూసెక్కులు వదులుతున్నారు.



నారీ-స్వశక్తి పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో బుధవారం నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు నిర్వహించే స్వస్థ్ నారీ-స్వశక్తి పరివార్ అభియాన్ పోస్టర్‌ను సోమవారం జేసీ సూరజ్‌గనోరే ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

జిల్లాలో యూరియా కొరత లేదు: కలెక్టర్

బాపట్ల టౌన్: జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్ డాక్టర్ వి. వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లాలో సోమవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌కేలు, పీఏసీఎస్ 35 కేంద్రాల ద్వారా 4,983 మంది రైతులకు 220 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇంకా 220 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని పేర్కొన్నారు. అవసరమైన రైతులు ఆయా గ్రామాల పరిధిలోని రైతుసేవా కేంద్రాలు, సహకార పరపతి సంఘాల ద్వారా పొందవచ్చని ఆయన సూచించారు.

గుంటూరులో హత్య.. గుండ్లకమ్మలో శవం!



రామాంజనేయులు (ఫైల్)

మద్దిపాడు/లక్ష్మీపురం: గుంటూరులో హత్యకు గురైన వ్యక్తి ప్రకాశం జిల్లా మద్దిపాడు సమీపంలోని గుండ్లకమ్మ నదిలో శవమై తేలాడు. అందిన సమాచారం ప్రకారం.. వేముల రామాంజనేయులు(45) కనిపించకపోవడంతో భార్య గుంటూరులోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు గుంటూరు పోలీసులు బండారు కొండయ్యను అదుపులోకి తీసుకుని విచారించారు. రామాంజనేయులును హత్య చేసి మద్దిపాడు మండలం వెల్లంపల్లి సమీపంలోని గుండ్లకమ్మ నది పక్కన పూడ్చి వేసినట్లు అంగీకరించాడు. గుంటూరు పోలీసులు సోమవారం రాత్రి 7:30 గంటల సమయంలో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు తరలించారు. గుంటూరు పోలీసులకు మద్దిపాడు ఎస్‌ఐ సైదులు సహకారం అందించారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

ఆర్డీఓ చంద్రశేఖరనాయుడు



కారంచేడు: యూరియా కోసం అన్నదాతలు ఆందోళన చెందాల్సిన పనిలేదని, అందరికీ సరఫరా చేస్తామని చీరాల ఆర్డీఓ చంద్రశేఖరనాయుడు స్పష్టం చేశారు. సోమవారం ఆయన కారంచేడు సొసైటీ వద్ద యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. 'యూరియా కోసం తిప్పలు' అనే శీర్షికతో సాక్షి స్టేట్ పేజీలో వచ్చిన కథనానికి రెవెన్యూ, పోలీస్, వ్యవసాయాధికారులు స్పందించారు. సంబంధిత అధికార యంత్రాంగం మొత్తం కారంచేడులో తిష్టవేసి ఎరువులు సరఫరా చేయించారు. గ్రామంలో రైతులకు అవసరమైన ఎరువులను దగ్గరుండి అన్ని సౌకర్యాలతో పంపిణీ చేయించారు. ఆదివారం ఎండలో రైతులు పడిగాపులు పడటంతో అధికారులు టెంట్ వేయించి, రైతులు కూర్చోవడానికి కుర్చీలు కూడా వేయించారు. వరుస క్రమంలో పేర్లు పిలిచి యూరియాను సరఫరా చేశారు.

పీజీ రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో జూలైలో జరిగిన పీజీ కోర్సుల రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు సోమవారం విడుదల చేశారు. ఎంఎస్సీ స్టాటిస్టిక్స్‌లో 45 మందికి 44 మంది, ఎంఎస్సీ బయోకెమిస్ట్రీలో 24 మందికి 17మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. రీవాల్యూయేషన్‌కు ఈనెల 24వ తేదీలోగా ఒక్కో పేపరుకు రూ.1860, పర్సనల్ వెరిఫికేషన్‌కు రూ.2190 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మానవత్వం చూపిన పోలీసులు



మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని హుస్సేన్ కట్ట వద్ద గత నాలుగు రోజులుగా మతిస్థిమితం లేని ఓ మహిళ తిరుగుతోంది. ఇది గమనించిన స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రవీంద్రనాయక్ తక్షణమే స్పందించి సోమవారం ఉదయం ఆ మహిళను మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విజయవాడ గిరిపురం అని తప్ప ఆమె ఇంకేమీ వివరాలు వెల్లడించలేక పోతోంది. ఆమె చెప్పిన ప్రాంతానికి పోలీస్ సిబ్బందిని పంపించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పాత్రికేయులను భయపెడుతున్నారు

వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టుల హక్కు. దాన్ని కూటమి ప్రభుత్వం హరించడం దారుణం. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను, అక్రమాలను ఎత్తిచూపుతూ వార్తలు రాసినందుకే సాక్షి ఎడిటర్, సిబ్బందిపై కేసులు నమోదు చేయడం దుర్మార్గం.



ప్రజల పక్షాన నిలబడే పత్రికలపై ప్రభుత్వం జులుం ప్రదర్శిస్తోంది. అడ్డగోలుగా కేసులు నమోదు చేస్తున్నారు. పత్రికలపై పెట్టిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలి. విలేకరులకు స్వేచ్ఛ ఇవ్వాలి. లేనిపక్షంలో భవిష్యత్తులో ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదం.

–ఎండీ ఫిరోజ్,
వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి



ప్రజాస్వామ్యం ఖూనీ

ప్రజలకు వాస్తవాలను తెలిపే పత్రికలపై కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడం, దాడులు చేయడం, వేధించడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలు, అరాచకాలపై రాజకీయ నాయకులు ఇచ్చిన స్టేట్‌మెంట్లు, ప్రసంగాలను ప్రచురించారనే ఆరోపణలతో పోలీసులు సాక్షి దినపత్రిక ఎడిటర్, సిబ్బందిపై కేసులు నమోదు చేయడం కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారి లోపాలను ఎత్తిచూపే పత్రికలపై కేసులు పెట్టి వేధించడం దారుణం. ఈ పద్ధతి ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికలు నిర్వీర్యమైపోతాయి. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ విషయంలో పునరాలోచించుకోవాలి. ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలించాలి.

–చిల్లపల్లి మోహనరావు, ఆప్కో మాజీ చైర్మన్



సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డీఆర్వో జి. గంగాధర్‌గౌడ్



డీఆర్వోకు సమస్యలు వివరిస్తున్న బాధితులు

బాపట్ల టౌన్: ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్వో జి. గంగాధర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను విన్నవించారని తెలిపారు. తన పరిధిలోని వాటికి అక్కడికక్కడే పరిష్కార చూపామని పేర్కొన్నారు. కొన్నింటిని పరిశీలన, మరికొన్నింటిని విచారణకు ఆదేశించామని చెప్పారు. జిల్లా నలుమూలల నుంచి 164 మంది ఫిర్యాదుదారులు వచ్చినట్లు తెలిపారు.

తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదు

పీజీఆర్ఎస్ లో నమోదైన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద 14,458 అర్జీలు నమోదు అయ్యాయని, వాటిని ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని ఆదేశించామని వెల్లడించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు ముందస్తు జాగ్రత్త పాటించాలని డీఆర్వో తెలిపారు. స్వస్థ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా కొనసాగుతుందని తెలిపారు. అందులో భాగంగా అన్ని ప్రాంతాల్లో సచివాలయాల స్థాయిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రజలంతా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వర్షాలు కురుస్తున్నందున కాచి వడపోసిన నీటిని మాత్రమే తాగాలని, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీఓ పి. గ్లోరియా, ఉప కలెక్టర్ లవన్న, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ నాగిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్. విజయమ్మ పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డుల ద్వారానే బియ్యం పంపిణీ

స్మార్ట్ న్యూ రైస్ కార్డుల ద్వారానే బియ్యం పంపిణీ జరుగుతుందని డీఆర్వో జి. గంగాధర్‌గౌడ్ తెలిపారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ స్మార్ట్ న్యూ రైస్ కార్డులను ప్రజల ఇంటి వద్దకే అందిస్తామని తెలిపారు. జిల్లాలోని 1,123 చౌక ధరల దుకాణాల పరిధిలో 4,71,382 రైస్ కార్డులు ఉన్నాయన్నారు. పాత కార్డులకు బదులుగా వాటి స్థానంలో స్మార్ట్ న్యూ రైస్ కార్డులను ప్రభుత్వం ఇస్తోందని తెలిపారు. 15వ తేదీ నుంచి పంపిణీని ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించిందని పేర్కొన్నారు. జిల్లాకు 4.71 లక్షల కార్డులు వచ్చాయని, సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికీ వచ్చి పంపిణీ చేస్తారని చెప్పారు.ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు ఎంపీడీవోలు పర్యవేక్షించాలని డీఆర్వో ఆదేశించారు. వీటి వినియోగం కోసం ఈ-పాస్ యంత్రాలను ఇప్పటికే జిల్లాకు ప్రభుత్వం విడుదల చేసిందని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు.



స్మార్ట్ కార్డులను ఆవిష్కరిస్తున్న డీఆర్వో, అధికారులు

పశువులకు గాలికుంటు వ్యాధుల టీకాలు

జిల్లాలోని పశువులకు గాలి కుంటు వ్యాధుల టీకాల కార్యక్రమం ఈనెల 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని డీఆర్వో గంగాధర్ గౌడ్ తెలిపారు. పశు వైద్యశాఖ రూపొందించిన వాల్‌పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో ఆయన విడుదల చేశారు.

కృష్ణమ్మ పరవళ్లు



దోనేపూడి కరకట్ట దిగువున లోలెవల్ వంతెనపై విద్యార్థినులు, వృద్ధులను వరద ప్రవాహంలో దాటిస్తున్న కుటుంబ సభ్యులు

- లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన వరద నీరు
- లోలెవల్ వంతెనల పైనుంచి వరద నీటి ప్రవాహం
- ప్రమాదకర స్థితిలో రాకపోకలు

కొల్లూరు : కృష్ణా నదిలో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ప్రకాశం బ్యారేజ్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటిని దిగువుకు యథాతథంగా దిగువకు విడుదల చేస్తుండటంతో నది నిండు కుండలా మారింది. బ్యారేజ్ నుంచి సోమవారం ఉదయం 3.15 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి వదలడంతో మధ్యాహ్నం నుంచి వరద ప్రవాహ తీవ్రత పెరిగింది. అంచులను ఒరుసుకుకంటూ కృష్ణమ్మ ప్రవహిస్తోంది. పెసర్లంక అరవింద వారధి సమీపంలోని నక్కపాయ గండి, గాజుల్లంక చినరేవు ద్వారా వరద నీరు లోతట్టు ప్రాంతాలతో పాటు ఇటుక బట్టీలు, పల్లపు ప్రాంతాల్లోకి భారీగా చేరింది. దోనేపూడి కరకట్ట దిగువున పోతార్లంక, తిప్పలకట్ట, కిష్కింధపాలెం, తోకలవారిపాలెం, జువ్వలపాలెం, తడికలపూడి గ్రామాలకు వెళ్లే లోలెవల్ వంతెన పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

ఉధృత ప్రవాహం.. ప్రాణాలు పణం

ఉధృతమైన కృష్ణా నదీ వరద ప్రవాహంలో ప్రాణాలు పణంగా పెట్టి ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నా నిలువరించే నాథులే కరువయ్యారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం దోనేపూడి – పోతార్లంక మార్గంలో ఉన్న లోలెవల్ వంతెన పైనుంచి సోమవారం ఉదయం నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రజలు, వాహనాలు రాకపోకలు నియంత్రించాల్సిన పోలీసు, రెవెన్యూ సిబ్బంది పత్తా లేరు. ప్రజలు ప్రమాదకర పరిస్థితిలో వరద నీటిలో రాకపోకలు సాగిస్తున్నారు. ప్రవాహంలో ఏ మాత్రం పట్టు కోల్పోయినా ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. పోలీసు, రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. సోమవారం సాయంత్రానికి ప్రకాశం బ్యారేజ్ నుంచి సముద్రంలోకి వదులుతున్న నీటి పరిమాణం క్రమంగా తగ్గుతూ 2.34 లక్షలకు చేరింది. మంగళవారానికి నీటి మట్టం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని ఆర్‌సీ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

రెవెన్యూ సమస్యలపై రైతు సంఘం ఆందోళన

తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేస్తామంటూ హెచ్చరిక



మార్టూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

మార్టూరు: మార్టూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ సమస్యలపై ధర్నా నిర్వహించారు. అధికార పార్టీ నాయకులు సైతం పాల్గొనటం సమస్యల తీవ్రతకు అద్దం పట్టింది. తహసీల్దార్ టి. ప్రశాంతిని నాయకులు రైతుల సమస్యలపై నిలదీయడంతో ఆమె ఇబ్బందికి గురయ్యారు. ధర్నాలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు, ఇతర నాయకులు రెవెన్యూ సమస్యలపై స్పందించారు.

తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి

బాపట్ల జిల్లాలో ఎక్కడా లేనివిధంగా మార్టూరు తహసీల్దార్ కార్యాలయం లో అవినీతి విపరీతంగా పెరిగి పోయింది. ప్రతి గ్రామంలోనూ జాయింట్ ఎల్పీఎం నంబర్లతో రైతులకు 1బీలు రాక బ్యాంకు రుణాలు పొందలేక, రిజిస్ట్రేషన్లు జరగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్టూరు మండలంలోని ద్వారకపాడు, వలపర్ల, లక్కవరం గ్రామాలతో పాటు అద్దంకి నియోజకవర్గంలోని వల్లాపల్లి, ధర్మవరం, కొమ్మినేని వారి పాలెం రామకూరు గ్రామాల్లోని 2565 ఎకరాలు భూమి ఎలాంటి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్లు జరగలేదు. వందలాది మంది రైతులు గత 12 సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేసి గ్రామాలకు ఒక వీఆర్వోను నియమించడంతో వారు తప్పించుకు తిరుగుతున్నారని, వసూళ్లు ఎక్కువయ్యాయని రైతు సంఘ నేతలు ఆరోపించారు. ఇటీవల అవినీతి వీఆర్వోలపై ఫిర్యాదు చేస్తే వారిని బదిలీ చేశారు కానీ సమస్యలు మాత్రం యథావిధిగానే ఉన్నాయని తెలిపారు. ఈ మధ్యకాలంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులలో ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదని చెప్పారు. రైతులు ఇచ్చిన వందలాది అర్జీలను కనిపించకుండా మాయం చేశారని ఆరోపించారు. మండలంలోని రెవెన్యూ సమస్యలపై గత నాలుగు నెలల కాలంలో తహసీల్దార్ కు రెండుసార్లు, ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి రెండుసార్లు తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. ఇటీవల ఇంకొల్లులో రెవెన్యూ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రులను కలిసి సమస్యల గురించి అర్జీలు ఇచ్చినప్పటికీ ఫలితం లేదని వాపోయారు.

విసిగి వేసారిపోతున్న రైతులు

భూ సమస్యలు పరిష్కారం కాక రైతులు విసిగి వేసారి పోతున్నారని, సమస్యలు త్వరలో పరిష్కారం కాకుంటే తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేస్తామని రామకోటేశ్వరరావు హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ టి. ప్రశాంతికి నాయకులు వినతిపత్రం అందజేసి, సమస్యల గురించి ఏకరువు పెట్టారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్వోలు దాదాపుగా ఉన్నారని, కోనంకి, కొలలపూడి గ్రామాలకు మాత్రం రావాలంటే భయపడుతున్నారని, అందుకు తానేమి చేయలేనని తెలిపారు. అధికార పార్టీకి చెందిన కొందరు రైతు నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో కొంత మంది నాయకులు చెప్పిన పనులే అధికారులు చేస్తున్నారని, మిగిలిన వారి పనులను సదర నాయకులే అడ్డుకుంటున్నారని చెప్పటం గమనార్హం. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు వీరవల్లి కృష్ణమూర్తి ఎనికపాటి రాంబాబు, గోనుగుంట్ల మోహనరావు, తాళ్లూరి శివరావు, బెజవాడ కృష్ణయ్య, బి సూరిబాబు, కందిమళ్ల శ్రీనివాసరావు, రైతులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారం

ఎస్పీ బి. ఉమామహేశ్వర్




సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ బి. ఉమామహేశ్వర్

బాపట్ల టౌన్: బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 54 మంది అర్జీదారులు పాల్గొని, తమ సమస్యలను ఎస్పీకు వివరించారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్న ఆయన త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లాలోని పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో అధికంగా భర్త, అత్తారింటి వేధింపులు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు వంటి కేసులు అధికంగా వస్తున్నాయన్నారు. వాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా చట్టపరంగా విచారించి పరిష్కరించాలని చెప్పారు. అర్జీదారుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని అధికారులను హెచ్చరించారు. తీసుకున్న చర్యలపై నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఎస్ఐ ఏ.నాగేశ్వరరావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కొత్త టీచర్లు వస్తున్నారు

- డీఎస్సీ 2025 ఎంపిక జాబితా విడుదల
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,140 పోస్టులు భర్తీ
- విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఎంపిక జాబితా
- ఈ నెల 22 నుంచి శిక్షణ తరగతులు



గుంటూరు ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. డీఎస్సీ-2025లో ఎంపికైన అభ్యర్థుల జాబితాను విద్యాశాఖ విడుదల చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 1,140 పోస్టులను భర్తీ చేయనున్నట్లు జాబితాలో పొందుపర్చారు. వాస్తవానికి ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో 1,159 ఖాళీలు ఉన్నట్లు డీఎస్సీ నోటిఫికేషన్‌లో చూపగా, 19 పోస్టులకు అభ్యర్థులు లేకపోవడంతో వాటిని భర్తీ చేయకుండా నిలిపివేశారు.

దరఖాస్తు సమయంలో ఇచ్చిన ఆప్షన్ ఆధారంగానే పోస్టింగ్స్

ఒకటికి మించి రెండు, మూడు పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ఉండగా, దరఖాస్తు సమయంలో ఇచ్చిన ఆప్షన్ ఆధారంగానే వారిని ఒక పోస్టుకు ఎంపిక చేశారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు దరఖాస్తు సమయంలో ఎస్జీటీ పోస్టును ఎంపిక చేసుకుని ఉంటేవారిని హైస్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు బదులుగా ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీగానే ఎంపిక చేసి, నియామకపత్రాలు వెబ్‌సైట్‌లో పెట్టారు. భర్తీ చేయనున్న పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్ 620, ఎస్జీటీ 520 ఉన్నాయి.

ఈనెల 22 నుంచి ఇండక్షన్ శిక్షణ

డీఎస్సీ-2025 ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 22 నుంచి ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దసరా సెలవుల తరువాత పాఠశాలలను కేటాయించి, సంబంధిత ఉపాధ్యాయులను పాఠశాలలకు పంపనున్నారు.

డీఈవో సైట్‌లో డీఎస్సీ- 2025 ఎంపిక జాబితా

గుంటూరు జిల్లాలో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన అన్ని కేటగిరీల వారీగా ఎంపిక జాబితాను డీఈవోజీన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. అదే విధంగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంతో పాటు జిల్లా కలెక్టరేట్‌లోని డిస్‌ప్లే బోర్డులలో జాబితాను ఉంచామని, అదనపు సమాచారం కోసం డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలని సూచించారు.

గుటకాయ'స్వాహా'పై విచారణ

- విచారణ అధికారిగా డెప్యూటీ డీఈవో సురేష్
- నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని వెల్లడి
- విచారణ సమయంలో బయట ఎస్ఎంసీ వైస్ చైర్మన్, పాత పీఈటీ మస్తాన్‌రెడ్డి మధ్య ఘర్షణ
- కేసు నమోదు



విచారణ చేస్తున్న డెప్యూటీ డీఈవో సురేష్



మస్తాన్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్

కర్లపాలెం: విద్యార్థుల సొమ్ము స్వాహా అని ఈనెల 12న సాక్షి పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో పీఈటీ, ఎన్‌సీసీ ఆర్గనైజర్‌గా ఎం.గోపి వ్యవహరించారు. ప్రస్తుతం వెనిగండ్లలో పీఈటీగా పని చేస్తున్నారు. చింతాయపాలెం హైస్కూలులో పని చేస్తున్న సమయంలో ఎన్‌సీసీ విద్యార్థుల సర్టిఫికెట్ల మంజూరులోనూ, యూనిఫాం అలవెన్స్‌లో అవకతవకలకు పాల్పడ్డారని కొంతమంది విద్యార్థులు, పేరెంట్స్ ఆర్జేడీకి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం ఉత్తర్వుల మేరకు స్థానిక పాఠశాలలో జిల్లా డెప్యూటీ డీఈవో కె.సురేష్ సోమవారం ప్రధానోపాధ్యాయుడు, వేణుమాధవ్, ఎంఈవోలు మనోరంజని, విద్యాశ్రీల సమక్షంలో విచారణ చేపట్టారు.

తల్లిదండ్రుల స్టేట్‌మెంట్లు నమోదు

ఈ సందర్భంగా డెప్యూటీ డీఈవో మాట్లాడుతూ విచారణకు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రుల స్టేట్‌మెంట్లు నమోదు చేశామని, వీటిని ఉన్నతాధికారులకు సమర్పించినట్లు తెలిపారు.

పాఠశాల బయట ఘర్షణ

పాఠశాల బయట చింతాయపాలెం ఎస్ఎంసీ వైస్ చైర్మన్ నాగలక్ష్మి, ఆమె కుమార్తె అనూరాధ, నంబూరు వ్యాయామ ఉపాధ్యాయుడు మస్తాన్‌రెడ్డి ఘర్షణ పడ్డారు. గతంలో వెనిగండ్ల పీఈటీగా పని చేసిన సమయంలో ఆయన సస్పెండ్ అయ్యారు. ఈ నేపథ్యంలో మస్తాన్‌రెడ్డి, వైస్ చైర్మన్ పిట్టు నాగలక్ష్మి, ఆమె కుమార్తె అనూరాధల మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. ఇందులో నాగలక్ష్మికి, మస్తాన్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. తన అబ్బాయి అయ్యప్పరెడ్డి సర్టిఫికెట్ కోసం కుమార్తె అనూరాధతో కలసి పాఠశాలకు వచ్చినట్లు నాగలక్ష్మి తెలిపారు. ఈ సమయంలో దూరం నుంచి మస్తాన్ రెడ్డి తమ ఫొటోలు తీస్తున్నాడని, దీన్ని ప్రశ్నించినందుకు తనపై దాడి చేశాడని నాగలక్ష్మి అంటోంది.

అన్యాయంగా సస్పెన్షన్

మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ తాను వెనిగండ్ల పీఈటీగా పనిచేసి నంబూరు పాఠశాలకు బదిలీపై వెళ్లానని తెలిపారు. వెనిగండ్లలో పనిచేస్తున్న సమయంలో అవకతవకలకు పాల్పడ్డానని పీఈటీ గోపి తన మీద అధికారులకు లేనిపోనివి చెప్పి పత్రికల్లో రాయించినట్లు ఆరోపించారు. దీంతో అధికారులు సస్పెండ్ చేసినట్లు వాపోయారు. గోపీపై విచారణను పత్రికల ద్వారా తెలుసుకుని వచ్చానని, తనకు జరిగిన అన్యాయాన్ని విచారణ కమిటీకి చెప్పుకునేందుకు వచ్చి పాఠశాల బయట కారులో కూర్చున్నట్లు వివరించారు.

నాగలక్ష్మి కూతురు అనూరాధ మొబైల్‌తో తన వీడియో తీస్తుండగా, తాను కూడా ఫోన్‌తో ఫొటో తీసే ప్రయత్నం చేసినట్లు చెప్పారు. అనూరాధ, నాగలక్ష్మి ఫోన్ లాక్కుని పగలకొట్టి, షర్టు చించి దాడి చేశారని మస్తాన్ రెడ్డి ఆరోపించారు. దాడిపై కర్లపాలెం ఎస్ఐ రవీంద్రను వివరణ అడుగ్గా ఘర్షణ, దాడి జరిగిన మాట వాస్తవమేనని తెలిపారు. ఇద్దరు ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,200 గరిష్ఠం : రూ. 2,800

మోడల్ ధర రూ. 2,500

పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 353

కొమ్ములు : 179 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,350	10,225	10,000

కాయలు : 174 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,350	10,561	10,000

మొత్తం అమ్మకాలు : 264.75 క్వింటాళ్లు

-దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	33,865
అమ్మకాలు	31,395
నిల్వ	8,678

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-14,300
నంబరు-5	10,000-13,400
273	10,500-13,500
341	10,000-15,000
4884	10,000-14,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,200
నంబరు-5	10,000-13,500
341	11,000-15,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,000
బాడిగ-355	10,000 - 16,000
దేవనూరు డీలక్స్	10,500 - 13,800
ఆర్మూర్	9,800 - 12,500
తాలుకాయలు	6,200 - 7,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-15,000
బాడిగ - 355	10,000-15,700
దేవనూరు డీలక్స్	10,500-14,500
తాలు	5,200 - 7,200

-కొరిటిపాడు (గుంటూరు)

బీసీల హామీలను నెరవేర్చాలి

జేసీకి సంఘ నాయకుల వినతిపత్రం



జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జి జేసీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బాపట్ల అర్బన్: ఎన్నికల ముందు బీసీలకు చేసిన వాగ్దానాలను అమలుపరచడంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధి చూపాలని బీసీల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఇన్‌చార్జ్ అధ్యక్షుడు బాపట్ల రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో సంఘం ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ జేసీ గంగాధర్‌కు పలువురు బీసీ నేతలు సోమవారం వినతి పత్రం అందజేశారు. ముందుగా చీలు రోడ్డు కూడలిలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ప్రదర్శనగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పిలుపు మేరకు వినతి పత్రాన్ని అందజేశామని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల ముందు బీసీలకు కేటాయిస్తామన్న 34 శాతం రిజర్వేషన్‌ను స్థానిక సంస్థల్లో అమలు పరచాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు ఏ విధమైన అట్రాసిటీ చట్టం ఉందో బీసీలకు కూడా ఆ మాదిరిగానే రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా లెక్కల ప్రకారం రిజర్వేషన్లను అమలు పరచాలని, బీసీ కులగణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భాజాపా ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కొక్కిలగడ్డ శ్రీనివాసరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో బీసీలకు కేటాయిస్తానన్న నిధులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. అగ్నికుల క్షత్రీయుల కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అనాదిగా అణిచివేతకు గురవుతున్న బీసీలకు రక్షణ చట్టం కావాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కేటాయింపుపై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. భాజపా మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీఎల్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ ప్రాదేశికంగా నియోజకవర్గాల విభజన పూర్తి చేసి, జనాభా దామాషా లెక్కల ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కేటాయించాలని కోరారు. రాష్ట్ర రాజధానిలో మహాత్మ జ్యోతీరావు పూలే, సావిత్రీ బాయి పూలే స్మృతివనాన్ని అద్భుత కళాఖండంగా దేశం గర్వించే రీతిలో నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ నేతలు ఉల్చి శ్రీను, కంకణాల రాంబాబు, రామ్మోహనరావు, ప్రత్తిపాటి సాయికుమార్ పాల్గొన్నారు.

రాత్రి ప్రతిష్ఠ .. తెల్లారి తొలగింపు

దేగరమూడిలో అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించిన అధికారులు



ఆదివారం అర్ధరాత్రి స్థాపించిన విగ్రహం



అధికారులు తొలగించిన ప్రదేశం

మార్టూరు: బాపట్ల జిల్లా మార్టూరు మండలం దేగరమూడిలో ఆదివారం అర్ధరాత్రి ప్రతిష్ఠించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి అనుమతులు లేవంటూ సోమవారం అధికారులు తొలగించారు. వివరాలు ఇలా ఉన్నాయి... స్థానిక జగనన్న కాలనీ సమీపంలోని రెండు సెంట్ల భూమిని పంచాయతీ సర్పంచ్ జంపని అంజమ్మ వార్డు సభ్యుల సంతకాలతో తీర్మానం చేయించి, గత నెలలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి సహకరించారు. సెప్టెంబర్ మొదటి వారంలో దళిత నాయకులతో కలిసి మార్టూరు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి ఆధ్వర్యంలో విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో అధికారులు విగ్రహ స్థాపనకు అనుమతులు లేవంటూ గ్రామస్తులకు, పంచాయతీ కార్యాలయానికి తెలిపారు. ఈ నేపథ్యంలో గత ఆదివారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులు శంకుస్థాపన స్థలంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సోమవారం ఉదయం ఆర్ఐ అశోక్, వీఆర్వో ఏడుకొండలు విగ్రహ ప్రతిష్ఠ స్థలాన్ని పరిశీలించి, ఈఓఆర్డీ రామాంజనేయులుకు విషయం తెలిపారు. ఆయన సూచనల మేరకు సచివాలయ కార్యదర్శి మరికొందరితో వచ్చి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించి పంచాయతీ కార్యాలయంలో ఓ గదిలో ఉంచి తాళం వేసి వెళ్లిపోయారు. ఈ విషయమై ఈఓఆర్డీ రామాంజనేయులును విలేకరులు వివరణ కోరగా విగ్రహ ప్రతిష్ఠ కోసం పంచాయతీ సభ్యులు తీర్మానం చేసిన భూమి గ్రామ కంఠానికి నికి చెందిన ప్రభుత్వ భూమి అని తెలిపారు. పంచాయతీ తీర్మానం ఉన్నప్పటికీ ఎంపీడీవో, పంచాయతీరాజ్ అధికారులు పోలీస్ డిపార్ట్‌మెంట్ తదితర శాఖలతో కూడిన మండల కమిటీ అనుమతులు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అనుమతులతో విగ్రహ నిర్మాణం చేపట్టాలని, గ్రామంలో ఇవేమి లేకుండా అర్ధరాత్రి విగ్రహ ప్రతిష్టాపన జరిగినట్లు ఆయన తెలిపారు.

పీఆర్సీ కమిషన్ వేయకపోవడం మోసగించటమే

- ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు
- సత్తెనపల్లిలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన ప్రదర్శన



సత్తెనపల్లిలో నిరసన ప్రదర్శన చేస్తున్న ఏపీటీఎఫ్ ఉద్యోగ, ఉపాధ్యాయులు

సత్తెనపల్లి: ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 2023 జులై నుంచి 12వ పీఆర్సీ వర్తింపజేయాల్సి ఉండగా సమయం దాటి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇంత వరకు కమిషన్‌ను నియమించక పోవడం ఉద్యోగులను మోసగించటమేనని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు నిరసన వారం 5వ రోజు కార్యాచరణలో భాగంగా సత్తెనపల్లి మండల పరిషత్ కార్యాలయం నుంచి సోమవారం ర్యాలీగా వెళ్లి తాలూకా కేంద్రం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనకు ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ మొహమ్మద్ ఇబ్రహీం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంటనే పీఆర్సీ కమిషన్ నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఉద్యోగుల సొమ్ము 10 శాతాన్ని పెట్టుబడిదారులకు దోచిపెట్టే కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీము రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. మెమో నంబర్ 57 ప్రకారం 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ వర్తింపజేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే కలిసొచ్చే సంఘాలతో పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు బాళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే విడుదల చేయాలని, బోధనేతర యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ హెల్త్ ప్రీమియం చెల్లిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, పరీక్షలలో అసెస్మెంట్ బుక్‌లెట్ విధానం వల్ల ఉపాధ్యాయుల బోధన సమయం హరించడమే కాకుండా పిల్లలకు ఏమాత్రం ఉపయోగం లేదని చెప్పారు. అసెస్మెంట్ బుక్ లెట్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాలూకా పరిధిలోని మండలాల ఏపీటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు శివారెడ్డి, ఫిరోజ్ ఖాన్, ధర్మారావు, ఐతమ్‌రాజు, రవికుమార్, శ్రీధర్, సుభాని, సాబీర్, చంద్రం, రమేష్, రామకృష్ణ, హఫీస్, కోటేశ్వరరావు, సునీల్, వెంకటేశ్వరరావు వినోద్, సమద్ ఖాన్, నాసరయ్య, సుబ్బారెడ్డి, ఇలియాస్, శేషగిరి, అత్తరున్నీసా, లెనీన్‌రాణి, శ్రీదేవి, తులసి, కుదిషియా పాల్గొన్నారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపికలు

సత్తెనపల్లి: అండర్-19 స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపికల తేదీల షెడ్యూల్‌ను ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు సోమవారం విడుదల చేశారు. ఈ నెల 17న ఖాజీపాలెంలోని డాక్టర్ బీఎస్ఆర్ఏరాజు జూనియర్ కాలేజీలో అథ్లెటిక్స్, సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫుట్‌బాల్, సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఈ నెల 18న మేడికొండూరు మండలం కొర్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫెన్సింగ్, గుంటూరు బీఆర్ స్టేడియంలో టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 19న చిలకలూరిపేట ఏఎంజీ జూనియర్ కళాశాలలో కరాటే జట్ల ఎంపికలు, అచ్చంపేట ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కాలేజీలో రెజ్లింగ్, గ్రికో రోమన్ జట్ల ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ నెల 20న గుంటూరు బీఆర్ స్టేడియంలో టేబుల్‌టెన్నిస్ జట్ల ఎంపికలు, ఈ నెల 22న గుంటూరు రూరల్ మండలం గోరంట్లలోని నెక్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్విమ్మింగ్ అండ్ డైవింగ్ వాటర్ పోలో, మోడరన్ పెంటాథలన్ జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయని వెల్లడించారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 2007 జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారు అయి ఉండాలని తెలియజేశారు.

20న నిరుద్యోగులకు జాబ్ మేళా

మాచర్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మాచర్ల ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ పల్నాడు జిల్లా అధికారి తమ్మాజీరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాకు సుమారు పది కంపెనీలు హాజరవుతాయని చెప్పారు. అందులో మాస్టర్ మైండ్స్, ఆదిత్య ఆర్గానిక్ ఎకో టెక్నాలజీ, కపిస్టన్ సర్వీసెస్, గోదావరి ఆంధ్ర కోఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ, ఎంఆర్ఎఫ్ టైర్స్, ఇన్నోవే సోర్స్, టీవీఎస్ బ్యాటరీ, టాటా ఎలక్ట్రానిక్స్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, స్కిల్ క్రాఫ్ట్ వంటి పలు రకాల కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. విద్యార్హతను బట్టి సుమారు రూ.15 వేలు నుంచి రూ.35 వేల వరకు జీతం ఉంటుందని చెప్పారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ అర్హతలు ఉండి, 18-35 వయస్సు గల నిరుద్యోగ యువతి యువకులు బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్ పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. మాచర్ల పట్టణంలోని ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేళా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వివరాలకు ఆర్.కిరణ్ నాయక్ 7842747682, శ్రీకాంత్ 9492158153 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేపు వారధి వార్షిక పోటీలు

డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజి ల్లా స్థాయి వారధి వార్షిక పోటీలు బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో వ్యాసరచన, వక్తృత్వం అంశాలలో పోటీలు ఉంటాయని చెప్పారు. వ్యాసరచనలో విద్యార్థుల మానసిక ఆరోగ్యం పెరుగుదలపై పాఠశాలల పాత్ర లేదా భారతదేశ పరిస్థితుల దృష్ట్యా ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన మూడు ముఖ్యమైన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అనే అంశాలపై పోటీ ఉంటుందని వివరించారు. వక్తృత్వంలో విద్యార్థుల అభ్యాసన పెంపుదలపై సామాజిక మాధ్యమాల పాత్ర లేదా భారతదేశ అభివృద్ధికి సంబంధించి ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అంశంపై పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనేందుకు 8, 9, 10వ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మాత్రమే అర్హులని వివరించారు. పోటీ ఇంగ్లిష్ మాధ్యమంలో మాత్రమే జరుగుతుందని స్పష్టం చేశారు. మండల స్థాయి పోటీలో ప్రథమ స్థానం సాధించిన టీమ్‌లను జిల్లా స్థాయికి పంపాలని తెలిపారు. జిల్లాస్థాయి విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

మెడికల్ కళాశాలలను అమ్ముకుంటున్నారు

- రూ.200 కోట్ల వసూలుకు పన్నాగం
- సీటు రూ.50 లక్షలకు అమ్ముకునేలా ప్రైవేటు వ్యక్తులకు అవకాశం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే మెడికల్ కళాశాలల స్వాధీనం
- గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి



దాచేపల్లి: చంద్రబాబు ప్రభుత్వం లంచాలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను అమ్ముకుంటుందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ఎవరైతే లంచాలు ఇచ్చి మెడికల్ కాలేజీలను లీజుకు తీసుకున్నారో.. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరిగి వాటిని స్వాధీనం చేసుకుంటామని ఆయన హెచ్చరించారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అయిన వెంటనే కాలేజీలను ప్రభుత్వం ద్వారానే నడిపించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సంపద సృష్టి స్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రూ.8 వేల కోట్లు విలువ చేసే 17 మెడికల్ కాలేజీలను తన చెంచాలకు అప్పగిస్తున్నాడని, దీనిపై తప్పనిసరిగా సీబీఐ, ఈడీ విచారణ ఉంటుందని మహేష్ రెడ్డి హెచ్చరించారు. తమ ఐదేళ్ల పాలనలో రెండేళ్లు కోవిడ్ పోతే మిగిలిన మూడు సంవత్సరాల్లో నాలుగైదు కాలేజీలు పూర్తి కాగా మరికొన్ని కాలేజీలు 60 నుంచి 80 శాతం వరకు నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయని వివరించారు.

పిడుగురాళ్ల కాలేజీ 60 శాతం పూర్తి

పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ 60 శాతం పూర్తి కాగా హాస్పిటల్ 90 శాతం పూర్తి అయిందని ఆయన చెప్పారు. 1923 నుంచి 2019 వరకు 96 సంవత్సరాలలో ఆంధ్ర రాష్ట్రంలో కేవలం 12 ప్రభుత్వం మెడికల్ కాలేజ్ ఉంటే వైఎస్ జగన్మోహన్ రెడ్డి సీఎం అయిన తరువాత 17 మెడికల్ కళాశాలను నెలకొల్పారని ఆయన అన్నారు. చంద్రబాబుకు చేతనైతే పూర్తి చేసి కళాశాలలను నడిపించాలని సవాల్ విసిరారు. ఒక్కొక్క మెడికల్ సీటు రూ.30 నుంచి 40 లక్షలకు అమ్ముకునేదానికి ఆ కాలేజీ ఎవరికైతే ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్నారో వారికి అనుమతులు ఇస్తున్నట్లుగా మీడియాలో కథనలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సుమారుగా ఐదేళ్లలో రూ.20 నుంచి రూ.30 వేల కోట్లు సంపదను సృష్టిస్తూ పోతే దాన్ని ఈరోజు అప్పనంగా అమ్ముకుంటున్నారని మహేష్ రెడ్డి ధ్వజ మెత్తారు.

టీడీపీ నాయకులకు మెదడు పనిచేయడం లేదు

ఎక్కడో అమరావతిలోనో, .గుంటూరులో ఏసీ రూములో కూర్చుని విమర్శలు చేసే తెలుగుదేశం నాయకులకు తాను ఛాలెంజ్ విసురుతున్నానని, టీడీపీ నాయకులకు దమ్ముంటే గురజాల గల్లీకి రావాలని, పిడుగురాళ్లలో ఉన్న కాలేజీ ఎలా పూర్తి చేశామో చూపిస్తామన్నారు. ఇప్పుడెందుకు మెడికల్ కళాశాలలను అమ్ముకుంటున్నారో ప్రజలందరికి తెలుసని, నిర్మాణం పూర్తి చేసుకున్న పులివెందుల మెడికల్ కళాశాలలో సీట్లు కేటాయిస్తామని చెబితే చంద్రబాబు ప్రభుత్వం సీట్లు కేటాయించవద్దని లేఖ రాయటం వాస్తవం కాదా? అని మహేష్ రెడ్డి ప్రశ్నించారు. రూ 500 కోట్ల విలువ చేసే ఒక్కో కాలేజీని కేవలం రూ.50 కోట్లకు అమ్ముకొని మరో రూ.200 కోట్లు లంచాలు తీసుకునేందుకే చంద్రబాబు ప్రభుత్వం కుట్ర చేస్తుందని మహేష్‌రెడ్డి మండిపడ్డారు. టీడీపీ నాయకులకు మెదడు సరిగ్గా పనిచేయటం లేదని, తెలుగుదేశం నాయకులు చేసే చౌకబారు విమర్శలకు తాము స్పందించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో భాగస్వామిగా ఉన్న టీడీపీ నాయకులు కొత్తగా మంజూరైన 17 మెడికల్ కాలేజీలకు ఒక్కో దానికి రూ.200 కోట్లు కూడా తీసుకురాలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఈ నిధులు తెస్తే అన్ని కళాశాల నిర్మాణాలు పూర్తి అవుతాయని మహేష్ రెడ్డి పేర్కొన్నారు. రూ.లక్షల కోట్ల అప్పు చేసి అమరావతిలో పెడుతున్నప్పుడు రూ.3 వేల కోట్లు అప్పుచేసి విద్య, వైద్యానికి ఎందుకు పెట్టరని ఆయన ప్రశ్నించారు. వెనుకబడిన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ మెడికల్ కళాశాలల నిర్మాణాలు కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తే ఆ ప్రాంతాలలోని నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి అన్నారు. మెడికల్ కళాశాల మంజూరులో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు ఎటువంటి సంబంధం లేదని, గత ప్రభుత్వంలో జవహర్‌రెడ్డి పట్టు పట్టి ఈ కళాశాలను మంజూరు చేయించారని మహేష్ రెడ్డి గుర్తు చేశారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిరస్మరణీయుడు

సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్ట్ జీఎం శ్రీనివాసులు



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సత్రశాల(రెంటచింతల): ఇంజినీరింగ్ రంగంలో అసాధారణ ప్రతిభతో అత్యున్నత శిఖరాలను అధిరోహించి మన దేశ ఖ్యాతిని చాటిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారత జాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డ అని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్ట్ జీఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం విశ్వేశ్వరయ్య జయంతి నిర్వహించారు. ప్రాజెక్ట్ ఆవరణలోని విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతు విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా దేశ వ్యాప్తంగా ఇంజినీర్స్ డేను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. జలాశయాల నిర్మాతగా, ఆర్థికవేత్తగా శాశ్వత కీర్తి గడించిన విశ్వేశ్వరయ్యను భారత ప్రభుత్వం 1955లో భారత రత్న పురస్కారంతోను, బ్రిటీష్ ప్రభుత్వం అత్యుత్తమ పౌర పురస్కారమైన బ్రిటీష్ నైట్‌హుడ్‌గా సన్మానించిందన్నారు. మైసూర్ ఆదర్శ నగరంగా మారడంలో ఆయన యనలేదినని కొనియాడారు. హైదరాబాద్, ముంబాయి నగరాలకు డ్రెయినేజి వ్యవస్థ రూపకల్పన, విశాఖపట్నం పోర్టు ఏర్పాటులో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఈఈ సుబ్రహ్మణ్యం, డెప్యూటీ ఈఈలు జయశంకర్, గిరిబాబు, మహమ్మద్, మతిన్, ఏఈలు వెంకటరమణ, మల్లేష్, ఏఈఈ శ్రీలత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

తాడేపల్లి రూరల్ : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే బాలబాలికల జట్లను సోమవారం తాడేపల్లి గుడ్ న్యూస్ స్కూలులో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కె. మహేష్, కార్యదర్శి అజయ్ మాట్లాడుతూ 51వ జూనియర్, బాయ్స్ గరల్స్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఈనెల 25న కృష్ణాజిల్లా గొల్లపూడిలో జరుగనున్నాయని తెలిపారు. ఈ పోటీలకు గుంటూరు జిల్లా నుంచి బాలికల టీమ్‌లో 15 మంది, బాలుర టీమ్‌లో 15 మందిని ఎంపిక చేశామని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు వచ్చినట్లు తెలిపారు. సెలక్షన్ కమిటీలో సుబ్బరాజు, అర్జున్, రాష్ట్ర వ్యాయామ అధ్యక్షులు కరిముల్లా చౌదరి, ఆరోగ్యదాసు, నూతక్కి రవి, రమేష్‌బాబు, మెల్లెంపూడి రవి, హరికృష్ణ, రాంబాబు, సాంబశివరావు, రజనీ నాయక్ ఉన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వృద్ధురాలిపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్



విజయ్‌ను అదుపులోకి నగరం పోలీసులు

నగరం: మండలంలోని చినమట్లపూడి శివారు దళితవాడలో అరవై సంవత్సరాల వృద్ధురాలిపై అత్యాచారం చేసి మరణానికి కారణమైన నిందితుడు వసుమతి విజయ్ కుమార్ అలియాస్ విజయ్‌ను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రేపల్లె రూరల్ సీఐ సురేష్‌బాబు సమాచారం మేరకు.. చినమట్లపూడి శివారు దళితవాడలో సుశీలమ్మపై ఈనెల 2వ తేదీ తెల్లవారుజాము సమయంలో అదే గ్రామానికి చెందిన విజయ్ అత్యాచారం చేయడంతో మృతి చెందింది.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు.విచారణలో విజయ్ అత్యాచారానికి పాల్పడినట్లు ఆధారాలు లభించాయని చెప్పాడు. నిందితుడిని శిరిపూడి నాగమ్మ కొట్టు సెంటర్ వద్ద సోమవారం అరెస్ట్ చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ బండ్ల భార్గవ్ పాల్గొన్నారు.

గుంటూరు జిల్లాలో వర్షపాతం వివరాలు

- గుంటూరు పశ్చిమలో 125.2 మి.మీ వర్షం
- సగటున 31.5 మి.మీ వర్షపాతం

కొరిటిపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. గుంటూరు నగరంలో ఆదివారం సాయంత్రం సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపిలేని భారీ వర్షం కురిసింది. జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా గుంటూరు పశ్చిమలో 125.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 6.4 మి.మీ వర్షం పడింది. సగటున 31.5 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు తూర్పులో 88.2 మి.మీ., పెదకాకాని 54.2, కాకుమాను 54, దుగ్గిరాల 45.6, మంగళగిరి 43, కొల్లిపర 38.4, తాడికొండ 26.6, పెదనందిపాడు 26.4, తాడేపల్లి 17.6, మేడికొండూరు 16.8, చేబ్రోలు 9.2, తుళ్ళూరు 8.4, ప్రత్తిపాడు మండలంలో 7.6 మి.మీ చొప్పున వర్షం పడింది. ఈ నెల 15వ తేదీ నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 79.7 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 137.3 మి.మీ వర్షపాతం నమోదైంది.

గంజాయి విక్రేత అరెస్టు

మంగళగిరి టౌన్ : గంజాయి కలిగిఉన్న ఓ యువకుడ్ని మంగళగిరి పట్టణ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి పట్టణ పరిధిలోని కొప్పురావు కాలనీలో నివాసముంటున్న మణికంఠ అనే యువకుడు గత కొంత కాలంగా పట్టణ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల్లో నివాసముంటున్నాడు. గంజాయి విక్రేతలపై పట్టణ పోలీసులపై నిఘా ఉంచారు. ఇందులో భాగంగా మణికంఠ వద్ద గంజాయి ఉందన్న సమాచారంతో పట్టణ సీఐ వీరాస్వామి సిబ్బందితో అతడి ఇంటిపై దాడి చేశారు. అదే సమయానికి గంజాయి పొట్లాలను కడుతూ ఉన్నాడు. అతడిని పట్టుకుని, ఇంటిని సోదా చేశారు. సుమారు 1500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఒక యువకుడి వద్దే ఇంత మొత్తంలో గంజాయి దొరకడంతో ఎక్కడ నుంచి వస్తోందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మణికంఠ కొంతకాలంగా గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారం ఉండడంతో అతనిపై నిఘా ఉంచామని పేర్కొన్నారు.